
మహిళల రోదనలు

కళ్లకుర్చిలో **52**కు పెరిగిన మృతుల సంఖ్య

ప్రధాన నిందితుల సహా ఆరుగురి అరెస్టు



ఆగని మృత్యుహేల

చెన్నై, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లా కరుణాపురం కల్తీసారా బాధితుల్లో మృతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య శుక్రవారం సాయంత్రానికి 52కు పెరిగింది. అంతేగాక పుదుచ్చేరి జిప్మర్, కళ్లకుర్చి, విల్లుపురం, సేలం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో 20 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా ప్రస్తుతం మరో 90 మందికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి దంపతుల సహా ఆరుగురిని సీబీసీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా అధికారుల సమాచారం మేరకు ఈ నెల 18న చట్ట వ్యతిరేకంగా విక్రయించిన కల్తీసారా తాగి తీవ్ర అనారోగ్యానికి గురై ఆ రోజు 11 గంటలోగా 17 మంది మృతి చెందారు. మరుసటి రోజు ఉదయానికల్లా మృతుల సంఖ్య 29కి పెరిగింది. మధ్యాహ్నానికి ఏడుగురు మృతి చెందటంతో మృత్యువాతపడిన వారి సంఖ్య 36కు పెరిగింది. గురువారం రాత్రికి మృతుల సంఖ్య 40కి పెరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రికి రకూ మరో 12 మంది వరుసగా ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 52కు పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఇలా రోజురోజుకు మృతుల సంఖ్య పెరుగుతుండటంతో కరుణాపురం వాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

నర్సు భర్త మృతి...

కల్తీసారా తాగినవారిలో ఓ నర్సు భర్త కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉళుందూరుపేట ఆస్పత్రిలో అసిస్టెంట్ మేట్రన్ (నర్సు)గా ఉన్న పూంగొడి భర్త ఆనందన్ కార్మికుడిగా పనిచేస్తూ కరుణాపురంలో చావింటికి వెళ్ళి అక్కడే అమ్ముతున్న కల్తీసారా తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురై సేలం ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం మృతి చెందాడు.

చెన్నైలో ప్రధాన నిందితుడి అరెస్టు.....

కల్తీసారా సంఘటనపై గురువారం నుంచి విచారణ ప్రారంభించిన సీబీసీఐడీ కల్తీసారా విక్రయించిన దంపతులు సహా నలుగురిని అరెస్టు చేశారు. కరుణాపురానికి చెందిన గోవిందరాజన్ అలియాస్ కన్నుకుట్టి, ఆయన భార్య విజయ, అతడి సోదరుడు దామోదరన్ సహా నలుగురిని అరెస్టు చేశారు. వీరిని సీబీసీఐడీ రహస్యంగా విచారించగా సారాలో కలిపేందుకు మెథనాల్‌ను శంకరాపురానికి చెందిన మాధేష్, జోసెఫ్‌రాజా అనే ఇద్దరు సరఫరా చేసినట్లు తెలుసుకున్నారు. దీంతో వారి ఆచూకీ కోసం పోలీసులు తీవ్రంగా గాలించారు. చివరకు వారిద్దరూ చెన్నైలో దాగినట్లు సమాచారం అందటంతో సీబీసీఐడీ పోలీసులు ఆగమేఘాలపై చెన్నై చేరుకుని శుక్రవారం వేకువజాము అరెస్టు చేశారు. దీంతో ఈ సంఘటనలో అరెస్టయిన వారి సంఖ్య ఆరుకు పెరిగింది. ఈ కేసులో అరెస్టయిన కన్నుకుట్టి, ఆయన సోదరుడు దామోదరన్, భార్య విజయను కళ్ళకుర్చి కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. వీరిని జూలై ఐదు వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ మేజిస్ట్రేట్ ఉత్తర్వు జారీ చేయడంతో ముగ్గురిని కడలూరు సెంట్రల్ జైలుకు తరలించారు.


మృతదేహాల వద్ద బంధువుల రోదన

చెన్నై, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చిలో కల్తీసారా తాగి మృతి చెందిన వారి పిల్లల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. శుక్రవారం ఉదయం అన్నాడీఎంకే సభ్యుల గెంటివేత అనంతరం ఆయన కళ్లకుర్చి కల్తీసారా ఉదంతంపై ప్రవేశ పెట్టిన సావధాన తీర్మానంపై స్పందిస్తూ కల్తీసారా దుర్ఘటనలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు డిగ్రీ వరకు చదివేందుకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారు. తల్లిదండ్రులను కోల్పోయి, సంరక్షకుడి పెంపకంలో ఉండే పిల్లలకు ప్రతి నెలా రూ.5వేల ప్రాంతానికి పంపానని, అంతేకాకుండా కళ్ళకుర్చి ఆసుపత్రిలో కల్తీసారా బాధితులకు చికిత్స చేయడానికి తగినంతమంది వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందిని చుట్టుపక్కల జిల్లాల నుండే కాకుండా చెన్నై నుంచి కూడా పంపానని చెప్పారు. పరిస్థితి పరిశీలించి కల్తీసారా నేరస్థులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని డీజీపీని ఆదేశించానని, డీజీపీ, హోంశాఖ కార్యదర్శి కూడా ప్రస్తుతం కళ్లకుర్చిలోనే పరిస్థితిని స్వయంగా పరిశీలిస్తున్నారని వివరించారు. అంతే కాకుండా సీబీసీఐడి విచారణకు కూడా ఆదేశాలిచ్చానని చెప్పారు. ఇక ఎక్సైజ్ శాఖ

పిల్లల బాధ్యత ప్రభుత్వానిదే

- 18 ఏళ్లు వచ్చే వరకు నెల నెలా రూ. 5వేలు
- వారి పేరుమీద రూ.5లక్షల దాకా డిపాజిట్
- అసెంబ్లీలో ప్రకటించిన స్టాలిన్


అసెంబ్లీలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చొప్పున, వారికి 18 యేళ్ల వయస్సు వచ్చే వరకు ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టం చేశారు. అంతేగాక తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల పేరు మీద రూ.5లక్షలు డిపాజిట్ చేసి, వారికి 18 యేళ్లు రాగానే తరువాత వడ్డీతో సహా ఇస్తామని తెలిపారు. తల్లిదండ్రుల్లో ఒకరిని కోల్పోయిన పిల్లలకు రూ.3లక్షలు డిపాజిట్ చేసి, 18 యేళ్లు రాగానే వడ్డీతో సహా అందిస్తామన్నారు. తల్లిదండ్రులను, లేదా వారిలో ఒకరిని కోల్పోయినవారి పిల్లలకు ప్రభుత్వం అమలు చేసే అన్ని పథకాల్లో ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు ఇష్టపడితే, వారికి నచ్చిన ప్రభుత్వ హాస్టళ్లలో ఉచితంగా బస చేసేందుకు అనుమతిస్తామన్నారు.


సమస్యలకు పారిపోయే పిరికిపంద కాను

కల్తీసారా ఘటనకు బాధ్యత వహించి తనను రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం విడ్డూరంగా వుందన్నారు. హోంశాఖ మాత్రమే కాకుండా ముఖ్యమంత్రిగా తనకు ఎదురయ్యే అన్ని సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కరించడమే తన విద్యుక్త ధర్మమని, సమస్యలను చూసి పారిపోయే పిరికిపందను కానని స్టాలిన్ ఉద్వేగంగా అన్నారు. సారా ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి, అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తగు చర్యలు చేపట్టానని, తొలి రోజే జిల్లా కలెక్టర్ ను బదిలీ చేసి, ఎస్పీని సస్పెండ్ చేశామని గుర్తు చేశారు. ఆ తర్వాత బాధితులకు మెరుగైన చికిత్స అందించేందుకు మంత్రులు ఈవీ వేలు, ఎం.సుబ్రమణ్యం, ఉదయనిధిని ఆ ఉన్నతాధికారులను, సిబ్బందిని కూడా సామూహికంగా బదిలీ చేశానని, అంతే కాకుండా కల్తీసారా సంఘటనకు బాధ్యులైన నలుగురిని అరెస్టు చేశారని, ఇంకా ఈ సంఘటనలో నేరస్తులు ఏ పార్టీకి చెందినవారైనా ఉక్కుపాదంతో అణచివేయడానికి తాను వెనుకాడబోనన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు జస్టిస్ గోకుల్ దాస్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. గతేడాది మే నెలలో జరిగిన కల్తీసారా దుర్ఘటనలపై కూడా సీబీసీఐడీ విచారణ జరిగిందని, ఆ కేసు రెండు జిల్లాలకు చెందినదని, అందులో విల్లుపురం జిల్లా పరిధికి చెందిన కేసులో 21 మందిని అరెస్టు చేశామన్నారు. వారిలో ఎనిమిదిమందిపై గూండా చట్టం ప్రయోగించామని చెప్పారు. ఆ దుర్ఘటనలో మెథనాల్ ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకువచ్చినట్లు రుజువైందన్నారు. చెంగల్పట్టు జిల్లా పరిధికి సంబంధించిన కల్తీసారా కేసులో ఆరు కేసులు నమోదు చేసి, 8 మందిని అరెస్టు చేసి, ఐదుగురిపై గూండా చట్టం ప్రయోగించినట్లు వివరించారు. ఈ సావధాన తీర్మానంపై ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే సభ్యులు కూడా చర్చలో పాల్గొని ప్రభుత్వానికి తగు సలహాలు ఇచ్చి ఉంటే తాను సంతోషించేవాడినన్నారు. ఈ తీర్మానంపై సెల్వపెరుంతగై, వేల్‌మురుగన్, జీకే మణి, ఈశ్వరన్, వీ నాగైమాలి, నయినార్ నాగేంద్రన్, వైద్యలింగన్, సదన్ తిరుమలైకుమార్, చిందనైసెల్వన్ తదితరులు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినందుకు సీఎం ధన్యవాదాలు తెలిపారు.

కళ్లకుర్చి ఘటనపై
అన్నాడీఎంకే ఆగ్రహం

- నల్లదుస్తులు, ప్లకార్డులతో నిరసన
- స్వరం కలిపిన పీఎంకే
- అసెంబ్లీ నుంచి ప్రతిపక్ష సభ్యుల గెంటివేత
- స్పీకర్ అధికార పార్టీ పక్షపాతి
- ఈపీఎస్ ఆగ్రహం
- 24న రాష్ట్ర వ్యాప్త నిరసన

చెన్నై, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి ఘటనపై ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే కళ్లకుర్చిలో కల్తీసారా వల్ల ఇంతమంది మరణించారంటూ నల్లదుస్తులతో నిరసన తెలిపింది. కల్తీసారా దుర్ఘటనకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి స్టాలిన్ రాజీనామా చేయాలంటూ ప్లకార్డులతో ప్రదర్శన జరిపింది. సభా నిర్వహణకు అంతరాయం కలుగుతోందంటూ ఆగ్రహించిన స్పీకర్ అప్పావు మార్షల్స్‌తో అన్నాడీఎంకే సభ్యులను సభ నుంచి గెంటించారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం ఉదయం శాసనసభకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, ఆ పార్టీ శాసనసభ్యులందరూ కళ్లకుర్చి ఘటనపై నిరసన తెలుపుతూ నల్ల చొక్కాలతో వచ్చారు. సభ ప్రారంభం కాగానే అన్నాడీఎంకే నేతలంతా కళ్లకుర్చి ఘటనకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని, కల్తీసారా మృతుల వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. సభ్యులు జీరో అవర్‌లో ఏం చెప్పాలనుకుంటున్నారో వెల్లడించవచ్చని, అప్పటి వరకూ అజెండా ప్రకారం సభ కార్యకలాపాలు జరగనివ్వాలంటూ స్పీకర్ పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినా అన్నాడీఎంకే నేతలు పట్టించుకోలేదు. అంతేగాక సీఎం రాజీనామా చేయాలంటూ స్పీకర్ పోడియం చుట్టుముట్టేందుకు ప్రయత్నించారు. ఇదే సమయంలో పీఎంకే సభ్యులు కూడా అన్నాడీఎంకేతో స్వరం కలిపారు. దీంతో సభ గందరగోళంగా తయారైంది. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో అన్నాడీఎంకే, పీఎంకే సభ్యులను సభ నుంచి గెంటివేయాలని స్పీకర్ మార్షల్స్‌ను ఆదేశించడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.


గెంటివేత అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఈపీఎస్


సీనియర్ నేత ఉదయకుమార్‌ను గెంటివేస్తున్న మార్షల్స్

ప్రశ్నిస్తే గెంటేస్తారా?: ఈపీఎస్ ఆగ్రహం

50 మందికి పైగా మృతి చెందిన ఘటనపై నిలదీస్తే ప్రభుత్వం తమను గెంటివేయించిందని, తటస్థంగా ఉండాల్సిన స్పీకర్ అధికార పక్షం చెప్పినట్లు ఆడుతున్నారని ఈపీఎస్ ఆరోపించారు. అసెంబ్లీ నుంచి గెంటివేత అనంతరం ఆయన తన సహచర ఎమ్మెల్యేలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ... కళ్లకుర్చి దుర్ఘటనకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి స్టాలిన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24 న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా, రాస్తారోకో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జనసంచారం అధికంగా ఉన్న కళ్లకుర్చి నడిబొడ్డున కల్తీసారా అమ్మకాలు జోరుగా సాగాయన్నారు. కల్తీసారాకు యాభైమందికి పైగా మృతి చెందినా అధికారులు తక్షణ చర్యలు తీసుకోలేదని, ఇంటెలిజెన్స్ కూడా పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కల్తీసారా బాధితుల తరఫున ప్రధాన ప్రతిపక్షనాయకుడిగా అసెంబ్లీలో తనను మాట్లాడనీయకుండా పాలకపక్షం అడ్డుకుందన్నారు. కల్తీసారా అమ్మకాలను నిరోధించలేని ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇకనైనా కల్తీసారా తాగి ఎంతమంది మరణించారు, ఆసుపత్రుల్లో ఇంకా ఎంతమంది చికిత్స పొందుతున్నారనే విషయమై వాస్తవాలను వెల్లడించాలని ఈపీఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొదట ఒకరిద్దరు కల్తీసారా తాగి మృతిచెందితే సాధారణ రోగాల వల్ల మృతి చెందినట్లు జిల్లా కలెక్టర్ శ్రవణ్‌కుమార్ చేత రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రకటన చేయించిందని, అందువలనే మృతుల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నారు.

పక్షపాతంగా వ్యవహరిస్తున్న స్పీకర్...

దేశమంతటా తీవ్ర కలకలం సృష్టించిన కళ్లకుర్చి కల్తీసారా మృతుల ఘటనపై శాసనసభలో ప్రస్తావించేందుకు స్పీకర్ అప్పావు అనుమతించకపోవడం గర్హనీయమని ఈపీఎస్ అన్నారు. 50 మందికిపైగా మృతి చెందిన విషయంపై ప్రధాన ప్రతిపక్షనాయకుడినైన తనను కూడా మాట్లాడేందుకు స్పీకర్ అనుమతించడం లేదని అన్యాయమన్నారు. ప్రతిపక్షం గొంతు నులిమేలా స్పీకర్, ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని ఈపీఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ మరణాలకు బాధ్యులెవరు?

కల్తీసారా అడ్డుకట్టకు ఏమేం చర్యలు తీసుకున్నారు? ● ప్రభుత్వాన్ని నిలదీసిన హైకోర్టు


చెన్నై, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): "గత ఏడాది కూడా కల్తీసారా కారణంగా అనేకమంది చనిపోయారు. అయినా మళ్లీ ఈ ఏడాది అలాంటి ఘటన పునరావృతమైంది. కల్తీసారా వల్ల అమాయకులే బలవుతున్నారు. ఆ మరణాలకు బాధ్యులెవరు? ఆ వ్యాపారాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలేంటి?" అంటూ మద్రాస్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. కల్తీ సారా నిరోధం కోసం ఇప్పటి వరకూ ప్రభుత్వం ఏం చర్యలు చేపట్టిందో చెప్పాలని ఆదేశించింది. ఇప్పటి వరకూ కల్తీసారా వల్ల ఎంతమంది చనిపోయారో వివరాలివ్వాలని కూడా స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణకుమార్, జస్టిస్ కుమారేశ్‌బాబుతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కళ్లకుర్చి కల్తీసారా వ్యవహారంపై సీబీఐ విచారణ కోరుతూ అన్నాడీఎంకే న్యాయవిభాగం కార్యదర్శి మాజీ శాసనసభ్యుడు ఇన్బదురై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయగా, శుక్రవారం ధర్మారణం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున న్యాయవాది డి.సెల్వం వాదనలు వినిపిస్తూ.. సారా అమ్మకాలపై స్థానికులు (కళ్లకుర్చి వాసులు) పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కళ్లకుర్చి కల్తీసారా వ్యవహారంపై సీబీసీఐడీ విచారణ జరిపినా ఫలితం ఉండదన్నారు. సీబీఐ విచారణ జరిగితేనే వాస్తవాలు బయటపడతాయని, అసలైన దోషులెవరో తెలుస్తుందన్నారు. ప్రజా ప్రయోజన వాజ్యం పేరుతో రాజకీయ లబ్ధి కోసమే ఈ పిటిషన్ వేశారని రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్ పేర్కొన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో 2001లో కల్తీసారా తాగి ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నారని తెలిపారు. కళ్లకుర్చి సంఘటనకు సంబంధించి శుక్రవారం ఉదయం వరకూ 47 మంది మృతి చెందారని, 117 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను కూడా సీబీసీఐడీ అరెస్టు చేసిందని కోర్టుకు తెలిపారు. నిందితులు ఎంతటి వారైనా, ఏ పార్టీకి చెందినవారైనా వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది.

యోగా భారతీయ సంప్రదాయం ఇచ్చిన వరం

- గవర్నర్ ఆర్ఎన్ రవి

ప్యారీస్, జూన్ 21: యోగా జీవనశైలిలో ఒక భాగమని, పరిపూర్ణ ఆరోగ్య సాధనకు సహకరించే యోగా భారతీయ సంప్రదాయమిచ్చిన గొప్ప వరమని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శుక్రవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో ఈ ఏడాది 10వ అంతర్జాతీయ యోగా దినంగా అన్ని జిల్లాల్లో జరుపుకోగా, పాఠశాల, కళాశాల, ఆయుర్వేద కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ధ్యాన మందిరాల నిర్వాహకులు పెద్దసంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు. ఇందులో భాగంగా కోవై వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో పాల్గొన్న గవర్నర్ ఆర్ఎన్ రవి మీడియాతో మాట్లాడారు. యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్న వారికి గవర్నర్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. యోగా ఆరోగ్యవంతమైన సమాజానికి దారిచూపుతుందన్నారు. 2023వ సంవత్సరం జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా సుమారు 24 కోట్ల మంది యోగాసనాలు వేశారని, అందువల్ల మనస్సుకు శాంతి, శరీరానికి ఆరోగ్య ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం యోగా దినోత్సవంలో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి డా.ఎల్.మురుగన్ కూడా యోగాసనాలు వేసి మీడియాతో మాట్లాడుతూ... యోగాకు భారత్ పుట్టినిల్లని, తొమ్మిదేళ్ల క్రితం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన యోగా శిక్షణ నేడు దాదాపు 175 దేశాలకు వ్యాపించిందన్నారు. సంప్రదాయ ప్రాచీన కళల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్న యోగా శిక్షణ గ్రామాలు, నగరాలు, పాఠశాలలు, కళాశాలలకు కూడా విస్తరింపజేయాలని మంత్రి సూచించారు.




కోవై వ్యవసాయ విశ్వవిద్యాలయంలో యోగాసనాలు వేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి - కేంద్రమంత్రి ఎల్.మురుగన్ యోగాసనం

సమాచార దర్శిని

వైమానిక దళ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 21: అగ్నివీర్ భారత వైమానిక దళ పరీక్షకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్ష అక్టోబరు 18న జరుగనుంది. https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌లో జూలై 8 నుంచి 28వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్లస్ టూ, డిప్లొమో కోర్సులు పూర్తిచేసిన 20 ఏళ్లకు పైబడిన వారు అర్హులు.

గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల

ఐసిఎఫ్, జూన్ 21: సబ్ రిజిస్ట్రార్, డిప్యూటీ వాణిజ్య పన్నుల అధికారి సహా 2327 ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించిన గ్రూప్-2 నోటిఫికేషన్ టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. సెప్టెంబరు 14వ తేది ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్ష జరుగనుంది. గురువారం ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు జూలై 19వ తేది వరకు జరుగనుంది. జూలై 24 నుంచి 26వ తేది లోపు దరఖాస్తులు సవరించుకోవచ్చు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి మెయిన్స్ నిర్వహిస్తారు. ఆ పరీక్ష తేది అనంతరం ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. వివరాలకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

24 నుంచి విద్యార్థులకు మానసిక శిక్షణ

ఐసిఎఫ్, జూన్ 21: విద్యార్థులకు మానసిక శిక్షణ తరగతులు ఈ నెల 24 నుంచి 28వ తేది వరకు జరుగనున్నాయి. కరోనా కాలంలో విద్యార్థులు మానసికంగా పలు సమస్యలు ఎదుర్కొన్నారని, వాటిని అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి ప్లస్ టూ విద్యార్థులకు మానసిక ఒత్తిడిని అధిగమించడం, జీవన నైపుణ్యాభివృద్ధి వంటి వాటిపై ఈ నెల 24 నుంచి 28వ తేది వరకు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు.

కిలో వెల్లుల్లి రూ.350

ఐసిఎఫ్, జూన్ 21: వెల్లుల్లి ధర కిలో రూ.350కి పెరిగింది. దేశంలోని వెల్లుల్లి అవసరాలను గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిసా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాలు తీరుస్తున్నాయి. జూన్, జూలై, సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు రెండు సీజన్లలో వెల్లుల్లి సాగుచేస్తున్నారు. ప్రస్తుతం ఉత్పత్తి తగ్గడంతో మార్కెట్‌కు తక్కువగా లోడ్లు దిగుమతవుతున్నాయి. ఈ కారణంగా మొదటి రకం వెల్లుల్లి కిలో రూ.350, రెండవ రకం రూ.270, మూడవ రకం రూ.180కి విక్రయమవుతుంది.

ఆగస్టు 31 వరకు దివ్యాంగులకు బస్ పాస్‌లు

ఐసిఎఫ్, జూన్ 21: దివ్యాంగులకు ఆగస్టు 31వ తేది వరకు బస్‌పాస్‌లు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో ఎంటీసీ బస్ పాస్ పొందుతున్నారు. ముగిసిన గడువు పొడిగించాలని రవాణా సంస్థకు విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తి పరిశీలించిన అధికారులు, ఆగస్టు 31వ తేది వరకు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఆర్థికసాయానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 21: ప్రభుత్వం అందజేసే ఆర్థిక సాయాన్ని పొందేందుకు చిత్రకారులు, శిల్ప కళాకారులు జూలై 5వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఉత్తమ శిల్ప కళాకారులు, చిత్రకారులకు వ్యక్తిగతంగా, బృందాలుగా ప్రభుత్వం ఆర్థికసాయాన్ని అందజేస్తోంది. అర్హులైన వారు 'డైరెక్టర్, కళలు, సంస్కృతి శాఖ, తమిళ్ పరిశోధన కాంప్లెక్స్, రెండవ అంతస్తు, తమిళ్ రోడ్డు, ఎగ్మూర్, చెన్నై-8' అనే చిరునామాకు జూలై 5వ తేదిలోపు దరఖాస్తులు పంపించాలి. ఇతర వివరాలకు 044-28193195 నెంబరు సంప్రదించవచ్చు.

పైప్ లైన్ గ్యాస్‌కు 30,000 మంది నమోదు

ఐసిఎఫ్, జూన్ 21: రాష్ట్రవ్యాప్తంగా పైప్ లైన్ గ్యాస్ కనెక్షన్లకు ఇప్పటివరకు 30,000 మంది నమోదుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో పైప్ లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసేందుకు ఇండియన్ ఆయిల్ సంస్థ నిర్ణయించింది. 2030లోపు 2.30 కోట్ల గృహాలకు కనెక్షన్లు ఇచ్చేందుకు ఆయిల్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. నగరంలో టొరెంట్ సంస్థ అరుంబాక్కం వంటి ప్రాంతాల్లో 500 గృహాలకు పైప్ లైన్ గ్యాస్ కనెక్షన్లు ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు ఈ కనెక్షన్ పొందేందుకు 30,000 మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు.

కొత్తరకం బొమ్మలు, గేమ్‌ల ఆవిష్కరణ

చెన్నై, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ బొమ్మల తయారీ సంస్థ 'ఫన్‌స్కూల్ ఇండియా' ఈ సీజన్‌లో పిల్లలకు వినోదం, విజ్ఞానాన్ని పంచేలా 18 రకాలైన ప్రత్యేక బొమ్మలు, గేమ్‌లను ఆవిష్కరించింది. 14 ఏళ్ల లోపు చిన్నారులకు ఇవి ఎంతో ఉపయుక్తంగా వుంటాయని సంస్థ ప్రకటించింది. సంస్థ సీఈవో ఆర్.జశ్వంత్ మాట్లాడుతూ.. ఏదైనా కొత్త ఉత్పత్తిని అభివృద్ధి చేస్తున్నప్పుడు పిల్లల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడంలో తాము ముందుంటామన్నారు. తాము ఆవిష్కరించిన గేమ్‌లు పిల్లలు ఆడుకోవడంతో పాటు ఎంతో విజ్ఞానాన్ని, నేర్చుకునే తత్వాన్ని పొందుతారన్నారు. తల్లిదండ్రుల అంచనాలకు అనుగుణంగా రూపొందించామని జశ్వంత్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

కుట్రాలంలో సీజన్ ప్రారంభం

ఐసిఎఫ్, జూన్ 21: కుట్రాలంలో చల్లటి గాలులు వీస్తుండడంతో సీజన్ ప్రారంభమైంది. తెన్‌కాశి జిల్లాలో ఉన్న ప్రధాన పర్యాటక స్థలమైన కుట్రాలం జలపాతాల్లో జూన్, జూలై, ఆగస్టు నెలల్లో సీజన్ ఉంటుంది. ప్రస్తుతం కేరళలో నైరుతి వర్షాలు ప్రారంభం కావడంతో తెన్‌కాశి జిల్లాలోనూ అప్పుడప్పుడు తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, శుక్రవారం వేకువజాము నుంచి తెన్‌కాశి జిల్లా, పశ్చిమ కనుమల ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై కనిపిస్తోంది. చిరుజల్లులతో పాటు చల్లటి గాలులు వీస్తూ ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ప్రధాన జలపాతం, పాత కుట్రాలం, ఐందరువి జలపాతాల వద్ద పర్యాటకుల సంఖ్య పెరిగింది.

మందుల నియంత్రణ శాఖ అధికారిగా శ్రీధర్

ఐసిఎఫ్, జూన్ 21: మందుల నియంత్రణ శాఖ అధికారిగా శ్రీధర్ నియమితులయ్యారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని ఆహార భద్రత శాఖ, మందుల నియంత్రణ బోర్డులు సంయుక్తంగా రాష్ట్ర ఆహార భద్రత, మందుల నిర్వహణ శాఖను రూపొందించాయి. శాఖాపరమైన నిర్వహణ చర్యల కోసం ఇద్దరు అధికారులు నియమితులయ్యారు. వారిలో రాష్ట్ర మందుల హక్కుల అధికారిగా హబీబ్ మొహమ్మద్ పదవీవిరమణ చేయగా, ఆయన స్థానంలో జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ మందుల నియంత్రణ అధికారిగా నియమితులయ్యారు.



రాష్ట్రవ్యాప్తంగా కల్తీసారా నిరోధానికి చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

నేత్రపర్వంగా కండదేవి రథోత్సవం

● పాల్గొన్న 100 గ్రామాల ప్రజలు

ప్యారీస్, జూన్ 21: శివగంగ జిల్లా దేవకోట సమీపంలోని కండదేవి గ్రామంలో ప్రసిద్ధిచెందిన స్వర్ణ ముక్తీశ్వర ఆలయంలో 17 ఏళ్ల అనంతరం శుక్రవారం జరిగిన రథోత్సవంలో 100 గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. ఈ ఆలయంలో పెరియనాయకి సమేత స్వర్ణ ముక్తీశ్వరులకు ప్రతి ఏటా ఆణి మాసంలో 9 రోజులు ఉత్సవాలు కోలాహలంగా నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో, 16 ఏళ్ల క్రితం రథం లాగడంలో ఆలయ గౌరవ మర్యాదల్లో ఇరువర్గాల మధ్య విభేదాలు ఏర్పడడంతో 2006వ సంవత్సరం నుంచి రథోత్సవాన్ని రద్దుచేశారు. ప్రస్తుతం న్యాయస్థానం ఇరువర్గాల మధ్య సయోధ్య కుదర్చడంతో శుక్రవారం ఉదయం 6.55 గంటలకు రథం ఆలయ ప్రధాన ప్రవేశద్వారం నుంచి కదిలింది. రథం లాగేందుకు పాసులున్న భక్తులను మాత్రమే అనుమతించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర సహకార శాఖ మంత్రి పెరియకరుప్పన్, కలెక్టర్ ఆషా అజిత్, ఎస్పీ డోంగ్రా ఉమేష్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. 100కు పైగా గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్న ఈ వేడుకలకు సుమారు 2,000 మందికి పైగా పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.



శివగంగ సమీపంలోని కండదేవి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి ఆర్థిక అనుబంధ పద్దులను ప్రవేశపెట్టనున్న సందర్భంగా శుక్రవారం శాసనసభలో సీఎం స్టాలిన్‌ను కలుసుకున్న ఆ శాఖ మంత్రి గీతా జీవన్

ప్రాచీన ఆంజనేయ విగ్రహం ప్రతిష్ఠ

ఐసిఎఫ్, జూన్ 21: తంజావూరు జిల్లా పట్టీశ్వరంలో ప్రాచీన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఐదేళ్ల అనంతరం జరిగింది. వెయ్యేళ్ల నాటి ఈ ఆలయంలో మూలవిరాట్టు కుడివైపున 300 ఏళ్ల నాటి అడుగు ఎత్తున్న నల్లరాతి ఆంజనేయ విగ్రహం ఉండే ది.



దేనుపురీశ్వరర్ ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహం

ఆ విగ్రహాన్ని 2019లో ఓ ముఠా అపహరించింది. 2022లో విదేశాలకు తరలిస్తున్న ఆ విగ్రహాన్ని విగ్రహాల స్మగ్లింగ్ నిరోధక విభాగం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ విగ్రహాన్ని మళ్లీ ఆలయంలో ప్రతిష్ఠించేందుకు అనుమతించాలని ఆలయ నిర్వాహకులు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో, విగ్రహ ప్రతిష్ఠకు కోర్టు అనుమతివ్వడంతో ఐదేళ్ల అనంతరం యథాస్థానంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి భక్తులు పూజలు నిర్వహించారు.

విక్రవాండి ఉప ఎన్నికల్లో 64 నామినేషన్లు

పెరంబూర్, జూన్ 21: విక్రివాండి శాసనసభ నియోజకవర్గంలో 64 నామినేషన్లు దాఖలయ్యాయి. డీఎంకే ఎమ్మెల్యే మృతిచెందడంతో ఈ నియోజకవర్గంలో జూలై 10వ తేది ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలకు నామినేషన్ స్వీకరణ ఈ నెల 14న ప్రారంభం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. ఈ ఎన్నికల్లో డీఎంకే తరఫున అన్నియూర్ శివ, పీఎంకే తరఫున సి.అన్బుమణి, నామ్ తమిళర్ కట్చి తరఫున డా.అభినయ సహా స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 64 మంది నామినేషన్లు వేశారు. శనివారం నామినేషన్ల పరిశీలన, సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తిచేసి, ఆ రోజు సాయంత్రం పోటీచేసే అభ్యర్థుల తుది జాబితా విడుదల చేయనున్నారు. జూలై 10న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు జరుగనుంది.

బర్త్‌డే వేడుకలు వద్దు

● కల్తీసారా బాధితులకు సాయం చేయండి
● అభిమానులకు విజయ్ విజ్ఞప్తి



చెన్నై, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చిలో కల్తీసారాకు 50 మంది దాకా ప్రాణాలు కోల్పోయి రాష్ట్రం శోకసంద్రంగా మారటంతో శనివారం తన పుట్టిన రోజు వేడుకలు జరుపరాదని, అవసరమైతే సారాకు బలైనవారి కుటుంబాలకు చేతనైన సాయం చేసి ఆదుకోవాలని తమిళగ వెట్రి కళగం నాయకుడు, ప్రముఖ సినీనటుడు విజయ్ తన అభిమానులకు విజ్ఞప్తి చేశారు. గురువారం కళ్లకురిచ్చిలో కల్తీసారా మృతుల కుటుంబీకులను పరామర్శించానని, ఆస్పత్రులలో చికిత్సపొందుతున్నవారి పరిస్థితులు చూసి కలత చెందానన్నారు. ఈ పరిస్థితులలో అభిమానులు తన జన్మదిన వేడుకల సందర్భంగా ఎలాంటి ఆడంబరాలకు పోవద్దని హితవు పలికారు. ప్రస్తుతం కల్తీసారా బాధితులను ఆదుకోవడమే అందరి కర్తవ్యమన్నారు.

ఇంటర్‌పోల్ సాయంతో కొడనాడు కేసు విచారణ

● కోర్టుకు తెలిపిన సీబీసీఐడీ

పెరంబూర్, జూన్ 21: కొడనాడు హత్య, దోపిడీ కేసుకు సంబంధించి ఇంటర్‌పోల్ సాయంతో విచారణ చేపట్టినట్లు సీబీసీఐడీ కోర్టుకు తెలియజేసింది.. నీలగిరి జిల్లా కొడనాడు ఎస్టేట్‌లో 2017 ఏప్రిల్ 24వ తేది దోపిడీ యత్నం జరిగింది. ఈ వ్యవహారంలో ఎస్టేట్ వాచ్‌మెన్ ఓంబహదూర్ హత్యకు గురయ్యాడు. ఈ కేసును నీలగిరి జిల్లా పోలీసులు విచారించి సయాన్ సహా పదిమందిని అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధాలున్న ప్రధాన నిందితుడు డ్రైవర్ కనకరాజ్ ఘటన జరిగిన కొద్ది రోజుల్లోనే రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కొడనాడు హత్య, దోపిడీకి సంబంధించి ఏడాదిన్నరకు పైగా సీబీసీఐడీ విచారిస్తోంది. ఈ కేసు ఊటీ కోర్టులో విచారణ సాగుతోంది. శుక్రవారం ఈ కేసు విచారణకు రాగా, కొడనాడు హత్య, దోపిడీకి సంబంధించి ముఖ్యమైన నిందితుడు కనకరాజ్ మరణించక ముందు 7 సార్లు విదేశాల నుంచి ఫోన్లు వచ్చాయని, ఆ విదేశీ కాల్స్ గురించి తెలుసుకొనేందుకు ఇంటర్‌పోల్ సహాయం తీసుకుంటున్నట్లు సీబీసీఐడీ పోలీసులు తెలియజేశారు. ఈ వాదన పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి, తదుపరి విచారణ జూలై 26వ తేదీకి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పుళల్ జైల్లో రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్యారీస్, జూన్ 21: స్థానిక పుళల్ సెంట్రల్ జైలులో ఆకస్మికతనిఖీలు జరిపిన పోలీసులు, మరుగుదొడ్డిలో ఉన్న రెండు సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు, ఛార్జర్ స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం ఉదయం ముగ్గురు ఖైదీలను విచారణ జరిపారు. ఈ జైలులో దాదాపు 3,000 మందికి పైగా ఖైదీలు శిక్ష అనుభవిస్తున్నారు. ఇక్కడ గంజాయి, సెల్‌ఫోన్ల వాడకం పెరిగిందని జైలు శాఖ అధికారులకు ఫిర్యాదులందాయి. అందులో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో పూందమల్లికి చెందిన అప్పు, సూరపట్టుకు చెందిన సురేష్, చూలమేడుకు చెందిన మణికంఠన్‌ల వద్ద విచారణ జరిపిన పోలీసులు, వారు అందించిన సమాచారంతో మరుగుదొడ్లలో దాచిన సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కల్తీ సారా ఘటనలో ఇద్దరు ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయాలి

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

ప్యారీస్, జూన్ 21: కళ్లకుర్చి కల్తీ సారా దుర్ఘటనలో ఆ ప్రాంతానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయాలని పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి డిమాండ్ చేశారు. కళ్లకుర్చి జిల్లా కరుణాపురంలో కల్తీ సారా తాగి 50 మందికి పైగా మరణించిన సంఘటన కలకలం రేపింది. శుక్రవారం కళ్లకుర్చి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను అన్బుమణి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... కళ్లకుర్చి కల్తీ సారా మరణాలు రాష్ట్రానికి తలవంపులు తీసుకొచ్చాయని, ఇందుకు డీఎంకే ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఈ ప్రాంతంలో చట్టవిరుద్ధంగా కల్తీ సారా విక్రయాలు బహిరంగంగా సాగుతున్నప్పటికీ అడ్డుకొనే చర్యలు తీసుకోని పోలీసులకు, ప్రభుత్వ అధికారులకు ఏ శిక్ష విధించినా సరిపోదన్నారు. శంకరాపురం ఎమ్మెల్యే ఉదయసూర్యన్ కల్తీ సారా విక్రయిస్తున్న వారికి అండగా ఉన్నారని, ఆయనకు సహకరించిన మరో ఎమ్మెల్యేను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన పరిహారం పెంచాలని, మాదకద్రవ్యాల నివారణపై ఎలాంటి చర్యలు చేపట్టని మంత్రులు ఏవీ వేలు, ఎస్.ముత్తుస్వామిలను పదవి నుంచి తొలగించాలన్నారు. ఈ వ్యవహారంలో సీబీఐ విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్బుమణి తెలిపారు.

కళాశాల విద్యార్థిని బెదిరించి యువతి లైంగిక వేధింపులు

పెరంబూర్, జూన్ 21: కళాశాల విద్యార్థిని బెదిరించి లైంగిక వేధింపులకు పాల్పడిన యువతిని పోలీసులు అరెస్ట్ చేశారు నగరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని, తిరుమంగళం మహిళా పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు వివరాలిలా ఉన్నాయి. "తిరుమంగళంలో ఓ అద్దింట్లో ఉంటూ ఇంజనీరింగ్ చదువుతున్నారు. తన ఇంటికి ఎదురుగా నివసించే 26 ఏళ్ల యువతితో స్నేహం ఏర్పడింది. అవసరమని అడగగా తాను రూ. లక్ష నగదు, ఒక సవర బంగారు గొలుసు ఆమెకు ఇచ్చానని,. ఆమెతో స్నేహం చేసిన సమయంలో తనకు మద్యం అలవాటు ఏర్పడింది. ఇద్దరం కలిసి మద్యం సేవిస్తుండగా, ఆ యువతి తనపై లైంగిక వేధింపులకు పాల్పడి, స్వలింగ సంపర్కం కోసం కోరడంతో నిరాకరించి అప్పటి నుంచి నేను ఆమెకు దూరంగా ఉంటున్నట్టు ఆ ఫిర్యాదులో రాసారు. కానీ తాను స్నానం చేస్తున్న సమయంలో తీసిని వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని, తాను స్నేహం కొనసాగించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటా"వని ఆ మహిళ బెదిరిస్తుందని సదరు విద్యార్థిని ఫిర్యాదులో పేర్కొంది. ఈ వ్యవహారంపై అసభ్యకరంగా మాట్లాడడం, హత్యా బెదిరింపు తదితర 5 సెక్షన్ల కింద కేసు పోలీసులు నమోదుచేసి యువతిని అరెస్ట్ చేసి అంబత్తూర్ కోర్టులో హాజరుపరిచారు. ఆ సమయంలో ఆ యువతి న్యాయమూర్తితో... నాకు ఏం జరుగుతుందో తెలియడం లేదు, ఏం చేస్తున్నానో అర్థం కావడంలేదు. అందువల్ల తనను మానసిక ఆసుపత్రిలో చేర్పించాలని కోరుతూ విలపించింది. దీనిపై స్పందించిన న్యాయమూర్తి, ఆమెను అయనావరంలోని మానసిక ఆస్పత్రిలో చేర్పించాలని ఉత్తర్వులు జారీచేశారు.

కోట మైదానంలో యోగా దినోత్సవం



యోగాసనాల్లో విద్యార్థులు - 'శక్తి అమ్మ' పేరు నమూనాలో నిల్చున్న విద్యార్థులు

వేలూరు, జూన్ 21: స్థానిక కోట మైదానంలో శక్తి అమ్మ ఆశీస్సులతో నారాయణి మెట్రిక్ స్కూల్, సీబీఎస్ఐ, శ్రీపురం స్కూల్స్ ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా కాళిముత్తు, కార్పొరేషన్ మేయర్ సుజాత, ప్రధాన విద్యాశాఖ అధికారి మణిమొళి తదితరులు పాల్గొని విద్యార్థులతో కలసి యోగాసనాలు వేశారు. ఈ వేడుకలు శ్రీపురం స్వర్ణాలయం ట్రస్టీ, నారాయణి స్కూల్ ప్రెసిడెంట్ సురేష్ బాబు నేతృత్వంలో సాగాయి. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు సురేష్‌బాబు జ్ఞాపికలు అందజేశారు.

రెడ్‌క్రాస్ సంఘం ఆధ్వర్యంలో...

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కాట్పాడి రెడ్‌క్రాస్ సంఘం, బీఎండీ జైన్ పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల సెక్రటరీ రుగ్గీ రాజేష్‌కుమార్ జైన్ అధ్యక్షత వహించి జ్యోతి ప్రజ్వలన చేయగా, కార్పొరేషన్ 1వ వార్డు మండల కమిటీ అధ్యక్షుడు పుష్పలత వన్నియరాజ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాట్పాడి రెడ్‌క్రాస్ సంఘ అవైఅధ్యక్షుడు జనార్ధనన్ ఆహ్వానం పలికారు. మాజీ జిల్లా ప్రాథమిక విద్య అధికారి గోపాల రాజేంద్రన్, ప్రకృతి సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు దశరథన్ యోగాసనాల గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా 3 నుంచి 10 ఏళ్ల వయసున్న విద్యార్థులు నిమిషంలో 27 యోగాసనాలు వేసి ప్రపంచ సాధన చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.



జ్యోతి ప్రజ్వలనలో అతిథులు, నిర్వాహకులు

చంద్రబాబుకు చంద్రశేఖర్ శుభాకాంక్షలు



చంద్రబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న చంద్రశేఖర్

చెన్నై, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీలోకి ముఖ్యమంత్రిగా పాదం మోపిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు ఆ పార్టీ చెన్నై అధ్యక్షుడు, సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు డి.చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలిపారు. 2021లో చేసిన శపథం మేరకు శుక్రవారం అసెంబ్లీలో అడుగు పెట్టిన చంద్రబాబును కలిసి నియోజకవర్గ వివరాలు వెల్లడించడంతో పాటు, పసుపు చొక్కా బహూకరించి అభినందనలు తెలిపారు. అంతేగాక ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు కూడా చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలిపారు.

వరకట్న వేధింపులకు బలైన మరో అబల

● గర్భిణి ఆత్మహత్య



అర్చన (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూన్ 21: కన్నియాకుమారిలో ప్రేమ వివాహం చేసుకున్న యువతి వరకట్న వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడింది. తిరువట్టారు సమీపం వలిక్కలాంపాడు సెంపెరుత్తివిలై ప్రాంతానికి చెందిన మణికంఠన్ రెండో కుమార్తె అర్చన (23) డిగ్రీ పూర్తిచేసింది. అర్చన 2022లో అభిష్‌మోన్ (27)ను ప్రేమ వివాహం చేసుకుంది. వివాహం అనంతరం అర్చన భర్త ఇంట్లో ఉండేది. కొద్దిరోజుల అనంతరం వరకట్నం తేవాలంటూ అభిష్‌మోన్ భార్యను వేధిస్తున్నట్లు, అతనికి తండ్రి, తల్లి, సోదరి అండగా నిలిచినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, మూడు నెలల గర్భంతో ఉన్న అర్చన గత ఆదివారం పుట్టింటికి వెళ్లి, భర్త, అత్తామామల వేధింపులపై తల్లిదండ్రులకు చెప్పింది. వారు ఆమెను సముదాయించి భర్త ఇంటికి పంపారు. ఈ నేపథ్యంలో, మంగళవారం సాయంత్రం, అర్చన ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని, సమీపంలోని ఆసుపత్రి తీసుకెళ్లేలోపు ఆమె మృతిచెందిందని అభిష్‌మోన్ తరపు బంధువులు మణికంఠన్‌కు తెలియజేశారు. కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని అర్చన తండ్రి ఫిర్యాదు మేరకు తిరువట్టారు పోలీసులు విచారణ చేపట్టారు.

పల్లిపట్టు సబ్ రిజిస్ట్రార్ నుంచి రూ.11 లక్షల స్వాధీనం

పెరంబూర్, జూన్ 21: తిరువళ్లూర్ జిల్లా పల్లిపట్టు సబ్ రిజిస్ట్రార్ కారులో రూ.11 లక్షల నగదును అవినీతి నిరోధక శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం విధులు ముగించుకొని కారులో ఇంటికెళ్తున్న సబ్ రిజిస్ట్రార్ మోహన్‌రాజ్‌ను ఏసీబీ అధికారులు అడ్డుకున్నారు. కారులో రూ.11 లక్షల నగదు గుర్తించగా, ఈ నగదుకు తనకు ఎలాంటి సంబంధం లేదని మోహన్‌రాజ్ సమాధానమిచ్చారు. అనంతరం నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు, ఆయన ఇంట్లో తనిఖీలు చేపట్టి బ్యాంక్ పాస్ పుస్తకాలు సహా పలు కీలక దస్తావేజులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో సుమారు 7 గంటలు మోహన్ రాజ్ ఇంట్లో అధికారులు తనిఖీలు చేపట్టి, ఆయనను విచారించారు.

రూ.24 కోట్ల మత్తు పదార్థాల స్వాధీనం

దంపతుల అరెస్ట్

ఐసిఎఫ్, జూన్ 21: ఇంట్లో దాచిన రూ.24 కోట్ల విలువైన మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు, దంపతులను అరెస్ట్ చేశారు. తూత్తుకుడి దక్షిణం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో మత్తు పదార్థాలు దాచినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ ఇంట్లో పోలీసులు తనిఖీ నిర్వహించగా 8 కిలోల మత్తు పదార్థాలను గుర్తించారు. వీటిని విక్రయించేందుకు యత్నించిన మట్టుకడై ప్రాంతానికి చెందిన నిర్మల్‌రాజ్, శివామి అనే దంపతులను అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ రూ.24 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు.

నగరంలో పశువుల పెంపకంపై నిషేధం

● కొత్త చట్టం కోసం ప్రభుత్వానికి కార్పొరేషన్ లేఖ

చెన్నై, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో పశువుల పెంపకంపై నిషేధం అమలు చేసేలా కొత్త చట్టం రూపొందించాలని కోరుతూ గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇటీవల కాలంలో తిరువొత్తియూరు తదితర ప్రాంతాల్లో గేదెలు, ఎద్దులు, రహదారిపై వెళ్తున్న పాదచారులను ఢీకొట్టి గాయపరిచాయి. తిరువొత్తియూరులో ఓ బర్రె మహిళను కొమ్ములతో పొడిచి ఆమెను 50 అడుగుల దూరం వరకూ లాక్కెళ్లి పడేసింది. ఆ సంఘటనలో మహిళకు బలమైన గాయాలు తగిలాయి. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన వ్యక్తిని కూడా ఆ బర్రె వెంటాడి కొమ్ములతో ఢీకొని గాయపరిచింది. ట్రిప్లికేన్‌లో ఓ పశువు ఢీకొనడంతో వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇలాంటి సంఘటనలు నగరంలో పదే పదే పునరావృతం అవుతుండటంతో పశువుల పెంపకంపై నిషేధం విధించడం మినహా మరో గత్యంతరం లేదని కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు నగరంలో పశువుల పెంపకంపై నిషేధం అమలు చేసేలా కొత్త చట్టాన్ని రూపొందించాలని కార్పొరేషన్ అధికారులు ప్రభుత్వానికి శుక్రవారం లేఖ రాశారు.

హత్యకేసులో పరారై

పరోటా మాస్టర్‌గా మారిన నిందితుడి అరెస్టు

చెన్నై, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండీ ప్రాంతంలో నాలుగేళ్ల క్రితం ఏళుమలై అనే వృద్ధుడిని హత్యచేసి నగలు, నగదు దోచుకెళ్ళిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కోయంబత్తూరుకు చెందిన శివకుమార్ నగరం నుంచి పారిపోయి పోలీసులు గుర్తించకుండా ఉండేందుకు ఈరోడ్‌లో పరోటా మాస్టర్‌గా పనిచేస్తుండగా రెండు రోజుల క్రితం పోలీసులు గుర్తించారు. యేడాది నుండి ఆ హోటల్‌లో పరోటా మాస్టర్‌గా పనిచేస్తున్న ఆయనను శుక్రవారం ఉదయం అరెస్టు చేశారు. శివకుమార్ గత నాలుగేళ్లుగా కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని హోటళ్లలో పనిచేసినట్లు పోలీసులు కనుగొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో నగదు, బంగారం స్వాధీనం

వేలూరు, జూన్ 21: స్థానిక కాట్పాడి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న నిత్యానందం (బాధ్యత) పలు అవకతవకలకు పాల్పడ్డారనే ఫిర్యాదులున్నాయి. దీంతో, బుధవారం రాత్రి కాట్పాడి కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు దాడి చేసి లెక్కల్లో చూపని రూ.2.14 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, తిరువణ్ణామలై జిల్లా కన్నమంగళంలోని ఆయన ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఇంట్లో గుంత తవ్వి అందులో దాచిన రూ.14 లక్షల నగదు, 80 సవర్ల నగలు, పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై సబ్ రిజిస్ట్రార్, ఆయన భార్యను అధికారులు విచారిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలపై సెయింట్ జోసెఫ్ కళాశాల అధ్యయనం



ఒప్పంద కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వడ్డి శేషగిరిరావు, ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు

ప్యారీస్, జూన్ 21: తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై నగరంలోని సెయింట్ జోసెఫ్ ఇంజనీరింగ్ కళాశాల రూ.41.5 లక్షలతో విశ్లేషణాత్మక అధ్యయనంపై ఒప్పందం కుదుర్చుకుంది. షోలింగనల్లూర్ సమీపంలోని సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రాంగణంలో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో భాగంగా గురువారం ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఇందులో ఇవాల్యుయేషన్ అండ్ అప్లైడ్ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ సుందరం, జాయింట్ డైరెక్టర్ విష్ణుకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డా.వడ్డి శేషగిరిరావు, అధ్యాపకులు, ఎంబీఏ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వడ్డి శేషగిరిరావు మాట్లాడుతూ తమిళనాడు ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు విశ్లేషణాత్మక అధ్యయనంపై తమ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ నేర్పనున్నట్లు తెలిపారు.



ప్రిజన్ సరసన ఇవాన వరుణ్

ప్రముఖ మోడల్‌గా గుర్తింపు పొందిన ఇవాన వరుణ్‌కు కోలీవుడ్‌లో ఓ బంగారు అవకాశం లభించింది. ప్రిజన్ హీరోగా నటించే చిత్రంలో ఇవానను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. ఈ చిత్రానికి 'రంజనా' అనే పేరు ఖరారు చేశారు. అధిరన్, సాంబ శివం, పద్మన్, అనుపమ కుమార్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలను సంతోష్ రావణన్ సమకూర్చి దర్శకత్వ బాధ్యత కూడా చేపట్టారు. సీవీ కుమార్, కె.సాంబ శివం సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఈ సినిమా గుర్తించి దర్శకుడు సంతోష్ రావణన్ మాట్లాడుతూ, 'ప్రేమ, థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిస్తున్నాం. పోలీస్ ఆఫీసర్‌గా హీరో ప్రిజన్ నటిస్తున్నారు. ముగ్గురు వ్యక్తులు వరుసగా అనుమానాస్పదరీతిలో చనిపోతారు. అదేసమయంలో హీరోకు కొన్ని సమస్యలు ఎదురవుతాయి. మిస్టరీ మృతుల వెనుక ఉన్న కారణాలు ఏంటి? ఈ మిస్టరీని హీరో ఛేదించారా? లేదా? అన్నదే ఈ చిత్ర కథాంశం. పోస్ట్‌ప్రొడక్షన్ నిర్మాణ పనులను పూర్తి చేసి త్వరలోనే విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. ట్రైలర్, ఆడియో, రిలీజ్ తేదీలను త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.

రూ.వంద కోట్ల వైపు 'మహారాజ' పరుగులు!!

విజయ్ సేతుపతి నటించిన 50వ చిత్రం 'మహారాజ' ఈ నెల 14వ తేదీ విడుదలై సూపర్ హిట్ సాధించి, వసూళ్ళ వర్షం కురిపిస్తుంది. ఇప్పటికే రూ.50 కోట్ల గ్రాస్ క్రాస్ చేసి, రూ.100 కోట్ల క్లబ్ దిశగా పరుగులు తీస్తుంది. ఈ సినిమా విడుదలైన అన్ని భాషల్లో హిట్ టాక్ సొంతం చేసుకోవడంతో ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రం ఇప్పటివరకు సాధించిన మొత్తం గ్రాస్ వసూళ్ళను నిర్మాణ సంస్థ అధికారికంగా వెల్లడించింది. సినిమా విడుదలైన మొదటి వారంలో రూ.55.8 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్టు పేర్కొంది. దీంతో 'మహారాజ' చిత్రం రూ.50 కోట్ల క్లబ్‌లో చేరి, ఇపుడు రూ.100 కోట్ల క్లబ్ దిశగా పరుగులు తీస్తుందని నిర్మాణ సంస్థ ప్యాషన్ స్టూడియో అధినేత సుధన్ సుందరం పేర్కొన్నారు. 'కురంగు బొమ్మై' ఫేం నితిలన్ స్వామినాథన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అనురాగ్, కాశ్యప్, మమతా మోహన్‌దాస్, నటరాజ్, అభిరామి, మునీష్‌కాంత్, సింగంపులి,భారతీరాజా, వినోద్ సాగర్, ఏఎల్ తేనప్పన్ తదితరులు నటించారు.



'మహారాజ' మూవీ పోస్టర్

సూర్యకాంతి కంటే ప్రకాశవంతంగా వుంది

మాళవికకు అభిమాని కితాబు

చిత్రజ్యోతి



మాళవిక మోహనన్

కేరళ భామ మాళవిక మోహనన్ స్వరాష్ట్రంలో 2013లో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టినప్పటికీ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'పేట' చిత్రంలో తొలిసారి తమిళ వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత అగ్రహీరోలు విజయ్, ధనుష్ చిత్రాల్లో నటించారు. పా.రంజిత్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్‌తో కలిసి నటించిన 'తంగలాన్' విడుదలకు సిద్ధంగా ఉంది. అయితే, ఈ భామకు పెద్ద హీరోల చిత్రాల్లో నటించే అవకాశాలు లభిస్తున్నప్పటికీ ఇండస్ట్రీలో ఇంకా నిలదొక్కుకోలేకపోతున్నారు. కానీ, సోషల్ మీడియాలో మాత్ర ఎంతో యాక్టివ్‌గా ఉంటోంది. ముఖ్యంగా ఎక్స్‌పోజింగ్ చేస్తూ నెటిజన్లను ఖుషీ చేస్తుంటుంది.. అదేసమయంలో ఫ్యాన్స్ వేసే చిలిపి ప్రశ్నలకు ఆమె సమాధానాలు చెబుతూ, వారు పొగడ్తలను స్వీకరిస్తుంటారు. ఈ కోవలోనూ తాజాగా ఓ వీరాభిమాని.. మాళవికతో చిట్‌చాట్ చేస్తూ.. 'మీ అందం సూర్యకాంతి కంటే ప్రకాశవంతంగా ఉంది' అని కామెంట్ చేయగా, దీనికి ఉప్పొంగిపోయిన ఆమె... ఆ అభిమానికి థ్యాంక్స్ చెప్పారు.

ఎన్నికల ప్రచారంలో

ఒక అంశంగా మద్య నిషేధం

● హీరో సూర్య



కేవలం ఎన్నికల ప్రచారంలో ఓటర్లను ఆకర్షించేందుకు మద్య నిషేధం ఒక అంశంగా మాత్రమే అన్ని రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయని అందుకే అన్ని పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత మద్య నిషేధం అంశాన్ని విస్మరిస్తున్నాయని హీరో సూర్య విమర్శించారు. కళ్ళకుర్చిలో కల్తీ సారాకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు 51 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై హీరో సూర్య తీవ్రంగా ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. 'మద్య నిషేధం అంశం రాజకీయ పార్టీలకు ఒక ప్రచారాంశంగా మారింది. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు టాస్మాక్ దుకాణాలు నెలకొల్పి ప్రజలు తాగుబోతులను చేస్తూ, చోద్యం చూసే దుస్థితి నెలకొంది. ఈ చర్యను మద్యం సేవించేలా ప్రోత్సహించే దుర్మార్గమైన చర్యను తక్షణం నిలిపివేయాలి. మద్యానికి బానిసలైన వారిని రక్షించి, వారికి తగిన జీవనోపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు దూరదృష్టితో ఆలోచన చేస్తేనే ఇలాంటి దురదృష్టకర సంఘటలు భవిష్యత్‌లో పునావృతం కాకుండా ఉంటాయి. మద్యం నిషేధం పాలసీని ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలి' అని సూర్య పేర్కొన్నారు.

ప్రత్యేక వైద్యపరికరాల వితరణ



ఆసుపత్రి నిర్వాహకులకు వైద్యపరికరాలను అందిస్తున్న అడయార్ ఆనంద్ భవన్ నిర్వాహకులు

చెన్నై, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి చెందిన కంచి కామకోటి చైల్డ్ ట్రస్ట్ హాస్పిటల్‌కు 'అడయార్ ఆనంద్ భవన్' రూ.50 లక్షల విలువైన ప్రత్యేక ఆధునిక వైద్య పరికరాలను విరాళంగా అందించింది. జీఈ అల్ట్రాసౌండ్ మెషీన్, 4 మల్టీపారామీటర్ మానిటర్లు, 3 సిరంజి ఇన్‌ఫ్యూసన్ పంపులు, 9 వాల్యుమెట్రిక్ ఇన్‌ఫ్యూసన్ పంపులు తదితరాలను ఉచితంగా అందించింది. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు కేటీ వెంకటేశ రాజా, కేటీ శ్రీనివాస రాజ మాట్లాడుతూ.. తాము అందించిన పరికరాలు చిన్నారుల జీవితం నిలబెట్టేందుకు దోహదపడతాయని సంతోషం వ్యక్తం చేశారు. మున్ముందు కూడా సహాయసహకారాలను కొనసాగిస్తామని ప్రకటించారు. ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రామచంద్రన్ మాట్లాడుతూ.. చిన్నారులకు అత్యుత్తమ వైద్యం అందించడమే తమ లక్ష్యమని ప్రకటించారు.

క్యాన్సర్ రోగులకు బ్రాకీథెరపీ



బ్రాంకీథెరపీ లోగో ఆవిష్కరిస్తున్న మెరిడియన్ హాస్పిటల్ వైద్యనిపుణులు

చెన్నై, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నైవాసులకు నాణ్యమైన వైద్యసేవలందిస్తున్న మాధవరం మెరిడియన్ హాస్పిటల్‌లో చెన్నై నుంచి నెల్లూరు వరకు ఉన్న క్యాన్సర్ రోగుల కోసం తొలిసారి బ్రాంకీథెరపీ చికిత్స ప్రారంభించినట్లు ఆ ఆసుపత్రి సీఈఓ డాక్టర్ అశోక్ త్యాగరాజన్ తెలిపారు. నగరంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్‌లో ఎలక్టా లినాక్ రేడియో థెరపీ కూడా ప్రారంభించామని, తమ ఆస్పత్రిలో క్యాన్సర్‌కు సంబంధించిన నాలుగు రకాల వైద్యనిపుణులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమగ్రంగా వైద్యపరీక్షలు జరిపి చికిత్స అందిస్తున్నారని తెలిపారు.. రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ రాజేష్, మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ పాండిదురై, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ కెన్నీ రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా నెల్లయప్పర్ రథోత్సవం



ప్యారీస్, జూన్ 21: జిల్లా కేంద్రం తిరునల్వేలి నగరంలో ప్రసిద్ధిచెందిన గాంధీమతి సమేత నెల్లయప్పర్ ఆలయ 518వ ఆణి రథోత్సవం శుక్రవారం ఉదయం కోలాహలంగా జరిగింది. వేలాదిమంది భక్తులు పాల్గొని దైవ దంపతులను దర్శించుకున్నారు. పురాతనమైన నెల్లయప్పర్ ఆలయంలో జరిగే ఉత్సవాల్లో ప్రధానమైనది ఆణి రథోత్సవం. ప్రపంచం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే ఈ ఉత్సవం ఈ నెల 13వ తేదీ పతాకావిష్కరణతో ప్రారంభమైంది. ఆ రోజు నుంచి ఉదయం, సాయంత్రం గాంధీమతి సమేత నెల్లయప్పర్ స్వామివార్లకు ప్రత్యేక అభిషేకం, అర్చన, అలంకార దీపారాధన శాస్త్రోక్తంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం గర్భగుడి, రాజగోపురాలు, మండపాలు, ధ్వజస్తంభాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామివారు, అమ్మవారు, వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరర్ సహా ఐదుగురు ఉత్సవమూర్తులను అలంకరించి చిన్న రథాల్లో వేంచేపు చేశారు. ఆణి ఉత్సవాల్లో ప్రధానాంశంగా తెల్లవారుజామున 4 గంటలకు పెద్ద రథానికి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఉదయం 7.45 గంటలకు రథం బయల్దేరుతుందని ప్రకటించారు. తిరునల్వేలి కలెక్టర్ కార్తికేయన్, నగర పోలీస్ కమిషనర్ మూర్తి, ఎంపీ రాబర్ట్ బ్రూస్ తదితరులు భక్తులతో కలసి రథం లాగారు. ఆ సమయంలో హఠాత్తుగా రథం ముందు ఉన్న తాడు తెగిపోవడంతో దానిని తొలగించి కొత్త మోపు తాడు కట్టారు. ఆ తర్వాత గంట ఆలస్యంగా రథం కదిలింది. రథోత్సవం సందర్భంగా శుక్రవారం తిరునల్వేలి జిల్లాకు సెలవు ప్రకటించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 1,500 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వృద్ధుల కోసం డ్యాన్స్ థెరపీ



మధురవాయల్ అతుల్య సీనియర్ కేర్ భవనంలో నృత్యం చేస్తున్న వృద్ధులు


చెన్నై, జూన్ 21 (ఆంధ్ర జ్యోతి): వృద్ధుల కోసం సకల సదుపాయాలతో అతుల్య సీనియర్ కేర్ సంస్థ మధురవాయల్ ఫెసిలిటీలో డాన్స్ అండ్ మూవ్‌మెంట్ థెరపీ (డీఎంటీ)ని ప్రవేశపెట్టింది.అంతర్జాతీయ యోగా దినోత్సవం, ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా మధురవాయల్ గృహసముదాయాల్లో నివసించే వృద్ధులకు నృత్య, యోగా కార్యక్రమాలు నిర్వహించినట్లు సంస్థ సీఈఓ జి శ్రీనివాసన్ తెలిపారు.



యోగాసనాల్లో విద్యార్థులు

ఘనంగా యోగా దినోత్సవం

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు





ప్యారీస్, జూన్ 21: ప్రపంచ యోగా దినోత్సవం రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరిగింది. యోగా విశిష్టత, ఆవశ్యకత గురించి యోగా గురువులు యోగాసనాల ద్వారా వివరించారు. పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రకృతి వైద్య కళాశాలల్లో యోగాసనాలు చేశారు. అరుంబాక్కంలోని ఇండియన్ మెడిసిన్ హోమియో వైద్య కళాశాల ప్రాంగణంలో విద్యార్థినీ, విద్యార్థులు, మహిళా వైద్యులు మొత్తం 195 మంది యోగా దినోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా చంద్ర నమస్కారంతో ప్రారంభించి 108 సార్లు నోవా ప్రపంచ రికార్డును బ్రేక్ చేశారు. యోగా డే సందర్భంగా ఈ కళాశాల ప్రాంగణంలో ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రకృతి వైద్య ప్రదర్శన ఏర్పాటుచేశారు. అదే విధంగా సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. అదే విధంగా, కోయంబత్తూర్ జిల్లా వెల్లయంగిరిలోని ఈషా యోగా ధ్యాన మందిరంలో భారీ ఆది యోగి విగ్రహం ముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, సీఆర్‌పీఎఫ్, పోలీసు, అగ్నిమాపక శాఖ బలగాలు ఆసనాలు వేశారు. స్థానిక మెరీనా బీచ్ రోడ్డులోని క్వీన్ మేరీస్ కళాశాల, నేపియర్ వంతెన సమీపంలో ఉన్న దక్షిణ భారత్ కోస్ట్‌గార్డ్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో, అడయార్ ఇందిరా నగర్‌లో ఉన్న నెహ్రూ యువ కేంద్రం ప్రాంగణంలో మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, బీజేపీ ఎమ్మెల్యే గాంధీ పాల్గొని యోగసనాలు వేశారు. అలాగే, రామనాథపురం జిల్లా ధనుష్కోటిలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మైలాపూర్‌లో బీజేపీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ యోగా దినోత్సవంలో పాల్గొని యోగాసనాలు వేశారు.



మైలాపూర్‌లో యోగాసనాలు వేస్తున్న బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్



కోస్ట్‌గార్డ్ బలగాల యోగాసనాలు



అరుంబాక్కం ఆయుర్వేద కళాశాల విద్యార్థుల యోగాసనాలు



ఈషా యోగా కేంద్రంలో అన్నామలై



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, మహిళలు - ధనుష్కోటిలో జరిగిన యోగా దినోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్